# నిశ్చలనం

అంతా సంసిద్ధమైనాక
కదిలే వరకూ ఆరాటమే!

మనసుకు పట్టిన
మంచు తెరల వెనక
స్పష్టాస్పష్టమైన అలజడులన్నీ
తొలగిపోయాక
కనుచూపు మేరంతా
కిటికీ కావల పుష్కలంగా కవిత్వం
అందుకునే ప్రయత్నంలోనే అంతర్ముఖత్వం

అదృశ్యంగా అందర్నీ పరిశీలిస్తున్నట్టు
నలుగురిలో ఏకాంతం

దూరం గుర్తొస్తుంది

అందరితో కలిసి
కాలాన్ని కత్తిరించటానికి
ఏవో కొన్ని అంశాలు
పేక ముక్కల్లా–
ఆగిపోయిన ప్రతీసారి
పరిగెత్తుకొస్తున్న వేవీ మనతో రావు
తోడైన ప్రయాణీకులెవరో చప్పున విడిపోతారు
మరీ తెలియని వారెవరో మళ్లీ మనలోకి –

రోజువారీ జీవితానికి దూరంగా

ఒక అపురూపమైన విశ్రాంతిలో
నన్ను నేను విస్మరిస్తున్నప్పుడే సరిగ్గా
నా యాత్ర కూడా ముగింపు కొస్తుంది
నగర జీవితంలో నన్ను పూడ్చేయ్యటానికి
అదిగో శవవాహికలు ఎదురు చూస్తున్నాయి